క్లుప్తంగా

జయంత్‌కు ఎంపీ పరామర్శ



జయంత్‌ను పరామర్శించిన ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

గరిడేపల్లి : మండల పరిధిలోని పొనుగోడు గ్రామానికి చెందిన రామ్ జయంత్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో మంగళవారం జయంత్‌ను రాజ్యసభ సభ్యుడు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట కార్మిక విభాగం జిల్లా కార్యదర్శి రణపంగ సైదులు, బీఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధి రామ్ సైదులు, మధు, శివ తదితరులు ఉన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ



ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి ఆకుపూజ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధసింధూరం, మన్యసూక్త పారాయణం, రామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై మనోహరాచ్యాలు, హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

28న సర్వసభ్య సమావేశం

గరిడేపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 28న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వనజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

మోతె : మండలంలోని నర్సింహాపురం శివారులో గల పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసి, సీజ్ చేసినట్లు ఎస్‌ఐ యాదవేంద్రరెడ్డి మంగళవారం తెలిపారు. అలాగే రాయికుంటతండాలో సారాయి తయారు చేసి అదే తండాలో విక్రయిస్తున్న ఆంగోతు నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కోర్టులో ఫైళ్లు దగ్ధం



దగ్ధమైన ఫైళ్లను పరిశీలిస్తున్న జడ్జీలు, సీఐ

కోదాడరూరల్ : పట్టణంలోని కోర్టులో షార్ట్‌సర్క్యూట్‌తో పలు ఫైళ్లు దగ్ధమయ్యాయి. సోమవారం రాత్రి కోర్టులోని రికార్డులు భద్రపరిచే గదిలో బీరువా వెనుక గల విద్యుత్ బోర్డులో షార్ట్‌సర్క్యూట్ జరిగి ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు భావిస్తున్నారు. ప్రమాదంలో బీరువాతో పాటు ఆ గదిలో గల పలు రికార్డులు, ఫైళ్లు దగ్ధమైనట్లు గుర్తించారు. ప్రమాద స్థలాన్ని జడ్జి శ్యాంసుందర్, సీఐ రాముతో పాటు విద్యుత్ ఏఈ మల్లెల శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సంఘటనపై కోర్టు సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అనంతగిరి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మీప్రసన్న అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రంగయ్యగూడెంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురికి రక్తపరీక్షలు నిర్వహించారు. ప్రస్తుత వేసవిలో వడదెబ్బ సోకకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యాధికారి హరినాథ్, వైద్య సిబ్బంది సురేందర్, విజయ్‌కుమార్, శ్రీదేవి, కృష్ణమూర్తి, ఆరోగ్య కార్యకర్తలు శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. మరిచారు

- నిరుపయోగంగా కమ్యూనిటీ హాళ్లు
- కల్పించని మౌలిక వసతులు
- శిథిలావస్థకు చేరుతున్న భవనాలు

నడిగూడెం : మండల పరిధిలోని పలు గ్రామాల్లో లక్షల రూపాయల వ్యయంతో ఎస్సీ, బీసీ కాలనీల్లో నిర్మించిన కమ్యూనిటీ భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. ఆ భవనాలను నిర్మించిన నాటి నుంచి నేటి వరకు వినియోగించకపోవడంతో శిథిలావస్థలకు చేరుతున్నాయి. ఆ భవనాల్లో మౌలిక వసతులు కల్పించకపోవడంతో వినియోగంలో లేకుండా పోతున్నాయి. నడిగూడెం మండల కేంద్రంతో పాటు, చెన్నకేశ్వాపురం, వేణుగోపాలపురం, బృందావనపురం, కాగితరామచంద్రాపురం, సిరిపురం, శ్రీరంగాపురం, రత్నవరం, తెల్లబల్లి, రామాపురం గ్రామాల్లోని ఎస్సీ, బీసీ కాలనీలల్లో 10సంవత్సరాల క్రితం లక్షల రూపాయల వ్యయంతో ప్రభుత్వం కమ్యూనిటీ భవనాలను నిర్మించారు. దీంతో నిర్మించిన నాటి నుంచి అవి నిరుపయోగంగానే ఉంటున్నాయి.



నడిగూడెంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీ భవనం

మౌలిక వసతులు కరువు..

కమ్యూనిటీ భవనాలు నిర్మించినప్పుడు ఆ భవనాల్లో ఎలాంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయలేదు. విద్యుత్ సౌకర్యంతో పాటు ఫ్యాన్‌లు, కుర్చీలు, టేబుళ్లు, దిన పత్రికలు ఏర్పాటు చేయలేదు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మొక్కుబడిగానే నిర్మించారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

శిథిలావస్థకు చేరిన భవనాలు..

నడిగూడెం ఎస్సీకాలనీ, బృందావనపురం, సిరిపురం, రత్నవరం, రామాపురం గ్రామాల్లో నిర్మించిన కమ్యూనిటీ భవనాలు శిథిలాస్థకు చేరాయి. గోడలు, తలుపులు దెబ్బతిన్నాయి. దీంతో ఆ భవనాల్లో విషసర్పాలు సంచరిస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాళ్లలో మౌలిక వసతులు కల్పించి అందుబాటులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తెల్లబల్లిలో నిరుపయోగంగా ఉన్న బీసీ కమ్యూనిటీ భవనం

అధికారులు స్పందించాలి



రత్నవరం ఎస్సీ కాలనీలో 18సంవత్సరాల క్రిందట నిర్మించిన కమ్యూనిటీ హాల్‌లలో మౌలిక వసతులు లేవు. దీంతో భవనం శిథిలావస్థకు చేరింది. సంబంధిత అధికారులు మౌలిక వసతులు కల్పించి, నిత్యం దినపత్రికలు వచ్చేలా చూడాలి.

– మొలుగూరి నర్సయ్య, రత్నవరం

మరమ్మతులు చేయించాలి



నడిగూడెం ఎస్సీకాలనీలో 15సంవత్సరాల క్రితం కమ్యూనిటీ భవనం నిర్మించారు. ఆరంభంలో పలు సౌకర్యాలు ఏర్పాటు చేశారు కానీ ఉపయోగంలోకి తీసుకరాకపోవడంతో నేడు శిథిలావస్థకు చేరింది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆ కమ్యూనిటీ భవనాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలి.

– బి.థామస్, నడిగూడెం

ధర్మభిక్షం నేటి యువతకు ఆదర్శం



నేరేడుచర్ల : ధర్మభిక్షం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : అన్యాయం, అక్రమాలు, దౌర్జన్యాలను అరికట్టేందుకు ఎర్రజెండా నీడన జీవితాంతం పనిచేసిన ధర్మభిక్షం జీవితం నేటి యువతకు ఆదర్శమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ధర్మభిక్షం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడారు. ధర్మభిక్షం విలువలతో కూడిన రాజకీయ నాయకుడిగా పని చేశారని కొనియాడారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా పేదల సమస్యలపై నిరంతరం పోరాడారని గుర్తుచేశారు. దేశంలో కార్మికులు పక్షాన అనేక ఉద్యమాలు చేపట్టిన చరిత్ర ఆయన సొంతమన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, సీనియర్ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, నాయకులు కొప్పోజు సూర్యనారాయణ, దొంతగాని సత్యనారాయణ, రమేష్, వాసుదేవరావు, వెంకన్న, స్టాలిన్, పద్మ, వెంకన్న, .వెంకటేశ్వర్లు, సైదులు, గాంధీ, మల్లయ్య, చిన్ననర్సిరెడ్డి ఉన్నారు.

గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో..

మాజీ ఎంపీ ధర్మభిక్షం వర్ధంతిని గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు పాలకూరి బాబు, దొంతగాని, బి.చిరంజీవి, ఎస్.కృష్ణ, సీహెచ్ సైదులు, లింగయ్య, పాపులు, సత్యనారాయణ, కాశయ్య, శంకర్, నర్సయ్య, నాగార్జున, ధనమూర్తి, పేద్దొడు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండల కేంద్రంలో మాజీ పార్లమెంట్ సభ్యుడు బొమ్మగాని ధర్మభిక్షం 13వ వర్ధంతిని మంగళవారం సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేరేడుచర్ల ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు, సీపీఎం పట్టణ కార్యదర్శి కోదమగుండ్ల నగేష్, ఆయా పార్టీల నాయకులు ఎల్లబోయిన లింగయ్య, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, గోవింద్ పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, పాల్గొన్న చైర్మన్ వెంకటేశ్వరరావు దంపతులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని తొగర్రాయిలో గల శ్రీసంతాన వేణుగోపాలస్వామి కల్యాణమహోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారిని అలంకరించి గరుడవాహనంపై అమ్మవారిని పల్లకిలో వేంచింపజేసి దివిటీ ఉత్సవం, ఎదురుకోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పట్టువస్త్రాల సమర్పన, మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలు వంటి వైదిక క్రతువును అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు స్థానిక, పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరరావు సంధ్య దంపతులు, అర్చకులు విష్ణువర్ధన ఆచార్య, రాకేష్‌శర్మ, రామకృష్ణఆచార్య, ధర్మకర్తలు యాదా శ్రీనివారావు, జ్యోతి, ఎంపీటీసీ లిక్కి గుర్వమ్మ, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీధర్, సురేష్ తదితరులు ఉన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



హుజూర్‌నగర్ రూరల్ : ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ పుష్పలత

హుజూర్‌నగర్ రూరల్ : ప్రజలకు క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి పుష్పలత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్షయ వ్యాధిని పూర్తిగా నివారించేందుకు ప్రభావంతమైన చికిత్స అందుబాటులో ఉందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జలుబు, బరువు తగ్గడం, ఆకలి మందగించడం తెమడలో రక్తపు జీరలు వంటి లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచిత మందులు, రోగులకు పోషకాహార నిమిత్తం నెలకు రూ.5వందలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పద్మ, హెచ్‌ఈఓ గజగంటి ప్రభాకర్, ఇందిరాల రామకృష్ణ, మమత, శ్రీనివాస్, ల్యాబ్ టెక్నిషియన్ రమేష్, ఆరోగ్య సిబ్బంది, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మునగాల : మండల కేంద్రంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడారు.



మునగాలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

క్షయవ్యాధి (టీబీ) నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. క్షయవ్యాధి నివారణకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పరీక్షలు, మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

క్షయ రహిత సమాజానికి కృషి చేయాలి

అనంతగిరి : క్షయ రహిత సమాజానికి కృషి చేయాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మీప్రసన్న కోరారు. మంగళవారం మండలంలోని త్రిపురవరంలో క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. క్షయ వ్యాధి త్వరగా నయమయ్యే వ్యాధి అని, రెండు వారాలు మించి దగ్గు, సాయంత్రం సమయంలో జ్వరం వస్తుందని, సరైన వైద్యం తీసుకుంటే వ్యాధి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు

నడిగూడెం: సమగ్ర సేంద్రియ పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త ఎ. కిరణ్ అన్నారు. గడ్డిపల్లి కేవీకేలో గత ఆరు రోజులుగా సేంద్రియ వ్యవసాయంపై రైతులకు నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణలో భాగంగా మంగళవారం నడిగూడెం మండలం సిరిపురం గ్రామంలో అభ్యుదయ రైతు వాసికర్ల శేషు కుమార్ సేంద్రియ సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త ఎ. కిరణ్ మాట్లాడుతూ.. 1.50 ఎకరం భూమిలో సేంద్రియ పద్ధతిలో వ్యవసాయ, ఉద్యానవన పంటలు, గడ్డిజాతి పంటలు సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చని రైతులకు వివరించారు. నేల సారం పెరగాలంటే జీవామృతం, ఘన జీవామృతం, వేస్ట్ డీ కంపోజర్, వర్మీ కంపోస్టు తయారు చేసి ఉపయోగించాలన్నారు. అదేవిధంగా చీడపీడల నివారణ కోసం నీమాస్త్రం, వావిలాకు, తూటికాడ, వేప ఆకు, వేప గింజలు, అగ్నిహస్త్రం, బ్రహ్మస్త్రం తదితర కషాయాలను ఉపయోగించవచ్చన్నారు. అనంతరం అభ్యుదయ రైతు వాసికర్ల శేషు కుమార్ మాట్లాడుతూ.. తక్కువ భూమిలో అధిక పంటలు సాగు చేసి, నిత్యం ఆదాయం తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు కన్నెబోయిన రామారావు, పగడాల భూపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త కిరణ్

చెరువు ఆక్రమణలను అరికట్టాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ చైర్మన్ రంగయ్య

నేరేడుచర్ల : మండలంలోని కల్లూరు గ్రామ ఊరచెరువు ఆక్రమణలు అరికట్టాలని కోరుతూ మంగళవారం మండల తహసీల్దార్ సైదులుకు కల్లూరు చెరువు సొసైటీ చైర్మన్ బుడిగె రంగయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా బావులను తవ్వుతున్నారని, కొంత మంది చెరువును పూడ్చి ఆక్రమిస్తున్నారని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి చెరువు హద్దులను నిర్ణయించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట చెరువు సొసైటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు లింగయ్య, హుస్సైన్, రాములు, వెంకటయ్య, పున్నయ్య తదితరులున్నారు.

మండలంలో పోలీసుల కవాతు

మోతె : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని నర్సింహాపురం, హుస్సేనాబాద్, మామిళ్లగూడెం, ఉర్లుగొండ, విభళాపురం గ్రామాల్లో మంగళవారం ప్రత్యే సాయుధ బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. కవాతులో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, స్థానిక ఎస్‌ఐ యాదవేంద్రరెడ్డి, ప్రత్యేక బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వరికోత మిషన్ టైర్లు దగ్ధం

మేళ్లచెరువు : మండలంలోని కప్పలకుంటతండా శివారుల్లో ఓ రైతు పొలంలో మంగళవారం మిషన్‌తో వరికోతలు కోస్తుండగా పొలాల్లో ఉన్న విద్యుత్ వైర్లు మిషన్‌కు తగలడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి మిషన్ టైర్లు పగిలి దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో ఆపరేటర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు.

సోమయ్య మృతికి సంతాపం

హుజూర్‌నగర్ : పట్టణంలోని హరిజనవాడకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త మంద సోమయ్య సోమవారం రాత్రి మృతి చెందారు. మంగళవారం ఆ పార్టీ నాయకులు ఆయన మృతదేహంపై కాంగ్రెస్ కండువా కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు త న్నీరు మల్లికార్జునరావు, మాజీ జెడ్పీటీసీ గ ల్లా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ కస్తాల శ్రవణ్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూరు మండల రెవెన్యూ కార్యాలయాన్ని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10 గంటలకు ఆర్డీఓ ఎమ్మార్వో కార్యాలయానికి రాగా ఉదయం 10.30 గంటలకు కూడా ఎమ్మార్వో, సర్వేయర్, సీనియర్ అసిస్టెంట్ రాకపోవడంతో అటెండెన్స్ రిజిస్టర్లలో అబ్సెంట్ వేశారు. 11:15రావడంతో ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం



గరిడేపల్లి : మాట్లాడుతున్న ఫణికుమార్‌శర్మ

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం శ్రీపార్వతి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో దూపదీప నైవేద్య అర్చక సంఘం నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నంబోట్ల ఫణికుమార్‌శర్మ పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్న అర్చకులు తమ దేవాలయాల్లో విధిగా పూజా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వం ద్వారా దూప దీప నేవైద్య అర్చకులకు రావాల్సిన వేతనాలు నెలనెలా అందేలా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, గౌరవ అధ్యక్షుడు సరస్వతీభట్ల లక్ష్మీరమణమూర్తి, ఉపాధ్యక్షుడు సుదర్శనంరాజన్, ఇరువంటి శ్రీనివాస్‌శర్మ, నర్ల శాండిల్యశర్మ, మురళీకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.



చిలుకూరు : పుస్తకాన్ని అందజేస్తున్న ఫణికుమార్

ప్రచార కార్యదర్శిగా రజనీకాంత్ ఆచార్య

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో గల కనకదుర్గ దేవాలయంలో ధూపదీప నైవేద్యం అర్చక సంఘం జిల్లా ఆత్మీయ సమేళ్మనాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో ధూపదీప నైవేద్యం అర్చక సంఘం జిల్లా ప్రచార కార్యదర్శిగా చిలుకూరు కాలువ ఓడ్డు అభయాంజనేయ స్వామి దేవాలయం పూజారి చించాపట్నం రజనీకాంత్‌ఆచార్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రజనీకాంత్ ఆచార్య మాట్లాడుతూ.. జిల్లా అర్చకుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నభొట్ల ఫణికుమార్‌శర్మ, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు రాయప్రోలు శ్రీరామశర్మ, రాష్ట్ర నాయకులు దౌలతాబాద్ వాసుదేవశర్మ, లక్ష్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలి

కోదాడరూరల్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్నీ క్షుణంగా తనిఖీ చేయాలని కోదాడ పట్టణ సీఐ రాము అన్నారు. మంగళవారం పట్టణంలో పలు సెంటర్లలో ఆయన వాహనాలను తనిఖీ చేసి మాట్లాడారు. ఎన్నికల వేళ నగదు, మద్యం అక్రమంగా తరలించకుండా తనిఖీలు చేస్తున్నామని, వాహనదారులు తనిఖీలకు సహకరిచాలని ఆయన కోరారు. తనిఖీల్లో ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ రాము, సిబ్బంది

క్రీడా దుస్తుల పంపిణీ

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని బీసీ గురుకుల పాఠశాలలో మంగళవారం మిర్యాలగూడ సోనిమా సత్రు సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు, న్యాయవాది శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటప్పయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.



క్రీడా దుస్తులతో విద్యార్థులు, సేవా సమితి సభ్యులు

దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ

చిలుకూరు : మండల పరిధిలోని సీతరాంపురం కొవనెంట్ చర్చిలో మంగళవారం ఇండియన్ క్రిష్టయన్ మినిస్టిస్ సహకారంతో దివ్యాంగులకు వీల్ చైర్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ చేయూత నివ్వాలన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు జెషిపాల్, సంస్థ రాష్ట్ర డైరెక్టర్ సాల్‌మెన్, వీల్‌చైర్ కోఆర్డినేటర్ మెహన్‌కృష్ణ, చర్చి పాదర్ అల్లురి అబ్రహం, ముప్పరాజు గాంధీ, చందా వెంకటేశ్వరరావు, పాదర్స్ రమేష్, శ్రీనివాస్‌చారి, లక్ష్మీనారాయణ, శ్రీను పాల్గొన్నారు.



వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న సంస్థ అధ్యక్షుడు

బాలశౌరి కుటుంబాన్ని ఆదుకోవాలి

మఠంపల్లి : మండలంలోని అల్లీపురం గ్రామపంచాయతీలో పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన నిరుపేద ఎంపీడబ్ల్యూ కార్మికుడు బాలశౌరి కుటుంబాన్ని అధికారులు, ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా నాయకుడు సయ్యద్‌రస్‌మియా కోరారు. మంగళవారం ఆయన బాలశౌరిని పరామర్శించి మాట్లాడారు. ఏళ్ల తరబడి వెట్టి చేస్తున్నా పంచాయతీ కార్మికులను ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికే నెలల తరబడి వేతనాలందక ఇబ్బందులు పడుతున్న కార్మికులకు ప్రమాదాలు జరగడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం వేతనాలు విడుదల చేయాలన్నారు. ఆయన వెంట సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇంటి రవి, మైసయ్య, దేవదానం, రహీం, గురువారెడ్డి, సంతోషం, సామ్రాజ్యం, వినోద్, రాకేష్, ప్రభాకర్, చార్లెస్, బాలు ఉన్నారు.

కొనసాగుతున్న పదోతరగతి పరీక్షలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ జానకిరాములు

మఠంపల్లి : మండల కేంద్రంలోని మూడు కేంద్రాల్లో నిర్వహిస్తున్న పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు ఎంపీడీఓ ఎం .జానకిరాములు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక సాంఘిక సంక్షేమ గురుకులంలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి అనంతరం మాట్లాడారు. ఆయన వెంట ఏపీఓ ఉమాదేవి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు బీటీరోడ్డు పనులు పూర్తి

- రూ.3.50కోట్లతో నిర్మించిన మాధవగూడెం వెళ్లే రోడ్డు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు, వాహనదారులు

చిలుకూరు : మండల పరిధిలోని కొండాపురం క్రాస్‌రోడ్డు నుంచి కొండాపురం, మాధవగూడెం, మునగాల మండలంలోని ముకుందాపురం మీదుగా విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారిని కలిపే బీటీరోడ్డు పనులు మంగళవారం ఎట్టకేలకు పూర్తయ్యాయి. రెండేళ్ల క్రితం ఈ రహదారి 8కిలోమీటర్లు బీటీ నిర్మాణానికి ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ.3.50కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభంలో ముమ్మరంగా జరిగినప్పటికీ అనంతరంబిల్లులు రాక కాంట్రాక్టర్ సంవత్సరం క్రితం పనులు మధ్యలోనే నిలిపివేశాడు. ప్రస్తుతం వారం రోజులుగా తిరిగి బీటీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పూర్తైన కొండాపురం- మాధవగూడెం బీటీరోడ్డు